క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

గొలుగొండ : కసిమి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుధారాణి ఆధ్వర్యంలో వరి పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. అలాగే ఖరీఫ్ అనంతరం రైతులు అపరాలు సాగు చేయడం వల్ల ఆర్థికంగా లాభాలు వస్తాయని తెలిపారు. మినుములు, పెసలు వంటి అపరాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోకు వీడ్కోలు సత్కారం



సీహెచ్‌వో దంపతులను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

మాకవరపాలెం: కమ్యూనిటీ హెల్త్ అధికారికి ఘన వీడ్కోలు పలికారు. స్థానిక పీహెచ్‌సీలో ఏడాదిగా సీహెచ్‌వోగా పనిచేస్తున్న అనురాధ పదవీ విరమణ చేశారు. బుధవారం పీహెచ్‌సీలో ఆ దంపతులకు వైద్యాధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలు అందించే వారు ఎక్కడ ఉన్నా గుర్తింపు ఉంటుందని వైద్యాధికారులు శ్రీవిద్య, సీతారామలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో అన్ని సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరెంట్స్ సమావేశాలు విజయవంతం చేయండి



ఎంఈవో-1 బి.పడాల్‌దాస్

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో ఈ నెల 7న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి బి.పడాల్‌దాస్ బుధవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులను విద్యాపరంగా మరింత ప్రోత్సహించడంలో భాగంగా పండగ వాతావరణంలో జరిగే ఈ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. ఉదయం 9 గంటల నుంచి తల్లులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలను సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు హాజరై సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఆటల్లో ఇమ్మానుయేలు విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో జీవన్‌రాయ్, ఉపాధ్యాయులు

మాకవరపాలెం : దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ఇమ్మానుయేలు స్పెషల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని తామరం ఇమ్మానుయేలు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్, చదరంగం, క్యారమ్స్ పోటీల్లో పది మంది దివ్యాంగ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి తమ సత్తా చాటారు. వీరికి జేసీ జాహ్నవి బహుమతులు అందజేసినట్టు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విద్యార్థులను ఇమ్మానుయేలు డైరెక్టర్ జీవన్‌రాయ్ బుధవారం అభినందించారు.

షిర్డీ సాయి ఆలయానికి రూ.10 వేల విరాళం



కమిటీ సభ్యులకు రూ. 10 వేలు అందజేస్తున్న వరహామూర్తి, శ్యామల దంపతులు

మాడుగుల : మండలంలో ఎం.కోడూరు షిర్డీ సాయి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన యాదగిరి వరహామూర్తి శ్యామల దంపతులు బుధవారం ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు రూ. 10 వేలు అందజేశారు. ఈ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఆలయ కమిటీ సభ్యుడు అప్పలనాయుడు తెలిపారు.

శత మర్కటం.. పీతలాటకం



- చెరకు తోటలు నాశనం చేస్తున్న కోతుల గుంపు
- వరి పంటను ధ్వంసం చేస్తున్న అడవి పందులు
- పంట చేతికందే దశలో వన్యప్రాణుల బెడద
- ఆందోళన చెందుతున్న కె.జె.పురం రైతులు



దబ్బకుంట రహదారిలో గుంపులు గుంపులుగా వున్న కోతులు





పొలంలో అడవి పందులు గట్టుపై పూర్తిగా గోతులు పెట్టిన దృశ్యం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం, చుట్టు పక్కల అన్ని గ్రామాల్లో పంట పొలాలను ఇటు కోతులు, అటు అడవి పందులు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. పొట్ట, చిరుపొట్ట దశలో వున్న వరి పంటను రాత్రి సమయంలో పంట పొలాల మీదకు వచ్చి చిందర వందర చేస్తున్నాయి. కొన్ని చోట్ల పండిన వరి పంటను, చెరకు పంటను అడవి పందులు పూర్తిగా నాశనం చేస్తున్నాయి. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ సమస్య గురించి రైతులు పలుసార్లు విన్నవించారు. అయినా సరే స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు గుంపు కొబ్బరి పిందెలను చెట్లు ఎక్కి కిందికి పడవేస్తున్నాయి. ప్రస్తుతం కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.40 విక్రయిస్తున్నారు. కొబ్బరి బోండాలు పిందె సమయంలో చెట్ల మీద నుంచి కోతులు కింద పారేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఒంటరిగా మధ్యాహ్నం సమయంలో తట్టలతో భోజనాలు పట్టుకెళ్లే మహిళలపై కోతులు దాడి చేస్తున్నాయి. దీంతో పొలాల వద్దకు వెళ్లడానికి సాహించడం లేదు. కె.జె.పురం దబ్బకుంటు రహదారి ప్రాంతంలో పంట పొలాలు రైతులతో పాటు తాచేరు నది ఒడ్డున్న వున్న కల్లం పాకలు వున్న రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రాత్రి పూట పందుల బెడద

కొన్ని చోట్ల పండిన వరి పంటను అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయి. వాటిని రైతులు కోసి నూర్పు చేశారు. అడవి పందులు పొలం గట్లు పూర్తిగా తవ్వేశాయి. చెరకు తోటలను విరిచి పారేస్తున్నాయి. వన్యప్రాణులను సంహరించకూడదని రైతులు వాటికి హాని తలపెట్టడం లేదు. కోతులు, అడవి పందుల బెడద నుంచి తమ పంటలను కాపాడాలని అధికారులను వేడుకుంటున్నారు.

మండలంలో కె.జె.పురంతో పాటు మాడుగుల, ఘాట్‌రోడ్డు జంక్షన్, సురవరం, సాగరం, ఎం.కోడూరు, తాటిపర్తి, కాశీపురం, తదితర గ్రామాల్లో కోతుల స్వైరవిహారం ఎక్కువగా ఉంది. దబ్బకుంటు రహదారిలో ఒంటరిగా ద్విచక్రవాహనాలు మీద ప్రయాణించే వారి మీద కోతులు దాడి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్డులో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కోతులు గుంపుగా వచ్చి పండ్లు, కూరగాయలు, దుకాణాలలోకి చొరబడి, వాటికి కావాల్సిన వాటిని చేతికి కరుచుకోని పోతున్నాయని, స్థానిక వర్తక సంఘం అధ్యక్షుడు కోట్ని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల ఆవరణలో కోతుల స్వైర విహారం వల్ల విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాను



కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల మాడుగుల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోతులు బెడద గురించి అధికారుల దృష్టికి తీసుకొచ్చాను. అడవి పందుల బెడద కూడా ఎక్కువగా వుంది. అటవీ అధికారులు చర్యలు తీసుకుని పంటలు కాపాడాలి.
– జామి రమణబాబు, సర్పంచ్ కె.జె.పురం గ్రామం

కొబ్బరి పిందెలు నమిలేస్తున్నాయి



కోతుల స్వైర విహారం రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. ఇటు కొబ్బరి పిందెలను నోటితో కరిచి తినివేస్తున్నాయి. అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, కోతులతో పాటు అడవి పందుల బెడద తప్పించాలి.
– పోతుబంది రాజుబాబు, రైతు, ఎం.కోటపాడు గ్రామం

జనంపై దాడి



ఒంటరిగా పంట పొలాలు, కళ్లం పాకల వద్దకు వెళ్లే మహిళల మీద కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయి. అడవి పందులు రాత్రి సమయంలో వరి, చెరకు పంటను నాశనం చేస్తున్నాయి. అటవీ అధికారులు స్పందించాలి. పంట చేతికొచ్చే సమయంలో వీటి నుంచి కాపాడాలి.
– కాళ్ల సూరిబాబు, రైతు, కె.జె.పురం గ్రామం

అటవీ అధికారులు స్పందించాలి



కోతులు, అడవి పందుల బెడద నుంచి కాపాడేలా అటవీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. వీటి బెడదతో రైతులు పొలంలోకి వెళ్లలేకపోతున్నారు. వీటి నివారణకు అధికారులు సహకరించాలి.
– పరిమి బాబ్జి, రైతు, కె.జె.పురం గ్రామం

నేడు వడ్డాది- తాటిపర్తి రోడ్డుకు శంకుస్థాపన

మాడుగుల రూరల్ : వడ్డాది నుంచి తాటిపర్తి వరకు గల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని మండల దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 కిలోమీటర్లు 700 మీటర్లు పొడవు కలిగిన ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ 23.59 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు ఘాట్ రోడ్డులో ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన అనంతరం జి.అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

పరిహారం ఇచ్చేవరకు రోడ్డు వేయనివ్వం



రోడ్డు పనులు అడ్డుకున్న సూర్యనారాయణరాజు

మాకవరపాలెం : నష్ట పరిహారం ఇచ్చేంతవరకు రోడ్డు వేసేదిలేదని మండలంలోని గిడుతూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. కొండలఅగ్రహారం నుంచి కోటవురట్ల మండలం యండపల్లి వరకు నూతనంగా రోడ్డు నిర్మించేందుకు 2018లో రూ.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో గిడుతూరు–మల్లవరం మధ్యలో 200 మీటర్ల మినహా మిగిలిన రోడ్డంతా నిర్మించారు. అయితే ఈ 200 మీటర్ల పరిధి భూమికి నష్ట పరిహారం ఇవ్వలేదంటూ అప్పట్లోనే పూసపాటి సూర్యనారాయణరాజు, ఎస్.నారాయణమూర్తి, వెంకటరమణలు రోడ్డు పనులు అడ్డగించారు. దీంతో ఈ ప్రాంతంలో పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో బుధవారం మరలా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో సూర్యనారాయణరాజు పనులను అడ్డుకున్నారు. తమకు ఇవ్వాల్సిన పరిహారం చెల్లించే వరకు ఈ పనులు చేయనిచ్చేదిలేదని స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న ఆధారాలతో రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ జేఈ నారాయణరెడ్డిని సంప్రదించగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నూకరాజు మరణం పార్టీకి తీరని లోటు



నూకరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ సతీమణి పెట్ల కళావతి

నాతవరం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శెట్టి నూకరాజు మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సతీమణి కళావతి అన్నారు. గుమ్మడిగొండలో బుధవారం నిర్వహించిన శెట్టి నూకరాజు పెద్దకర్మ కార్యక్రమానికి విచ్చేసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూకరాజు సర్పంచ్‌గానూ, పార్టీలో అనేక పదవులు నిర్వహించి ప్రజలకు సేవలందించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి వెంకునాయుడు, సీనియర్ నాయకుడు కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు అచ్చియ్యనాయుడు, లక్ష్మణరావు, లోవ కృష్ణ, పోలుపర్తి వెంకటరమణ, తమరాన సత్యానారాయణ, సర్పంచులు మిరపల వెంకటరమణ, వేముల సూర్యనారాయణమూర్తి, జివిరెడ్డి సోమన్నదొర, గుడపర్తి అచ్చియ్యనాయుడు, గన్నవరం పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇంచార్జి వరహాలబాబు, పార్టీ సీనియర్ నాయకులు యోగీశ్వరుడు, ముత్తా శివాజీ, రెడ్డి సత్యనారాయణ, లాలం లోవ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు జోగిరాజు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశం

మాడుగుల : ఈ నెల 7వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో తల్లిదండ్రులతో ముచ్చట్లు అనే కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం జరగనుందని హెచ్ఎం బండారు ముత్యాలనాయుడు తెలిపారు. తల్లిదండ్రుల ఎదుట ఆటలు, పాటలతో పాటు పలు పోటీలు విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని హెచ్ఎం కోరారు.

మాడుగుల రూరల్ : ఈ నెల 7వ తేదీన మండలంలో అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం జరుగుతుందని ఎంఈఓలు బి.దేముడమ్మ, పాండురంగారావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ సమావేశానికి పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్కూలు కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

15వ తేదీ లోగా ఫసల్ బీమా చెల్లించాలి

చీడికాడ : వరి, జీడిమామిడి, మినుము, పెసర పంటలకు ఈ నెల 15వ తేదీలోగా రైతులు ఫసల్ బీమా యోజన కింద రైతు వాటా చెల్లించి నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణవేణి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ వరి, జీడిమామిడి, మినుము, పెసర పంటలు పండించే రైతులు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోతే ప్రభుత్వం ఈ బీమా ద్వారా ఆదుకుంటుందన్నారు. వరికి రైతు వాటా కింద ఎకరాకు రూ.630 చెల్లించాలని, జీడిమామిడికి ఎకరాకు రూ.1540, మినుము, పెసరకు రూ.300 చెల్లించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఆయా సచివాలయాల పరిధిలో గల రైతు భరోసా కేంద్రాల వద్ద అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని కోరారు.

రోలుగుంట: రైతులు తమ పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. తమ పంటలకు బీమా కట్టుకోవడానికి గాను రబీ క్రాప్ ఇన్సూరెన్సు లాగిన్ ఓపెన్ అయింది. పంట బీమా చేయించుకునే రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్, బ్యాంకు ఖాతా జెరాక్స్ కాపీలను వ్యవసాయకార్యాలయంలో అందజేసి మొబైల్ నెంబరు తెలియజేయాలన్నారు. ప్రీమియం రుసుం రూ. 300 (మినుము,పెసర)కి బీమా మొత్తం రూ 20వేలు వర్తిస్తుందన్నారు.



పోతనపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ వాసుదేవరావు

మాడుగుల రూరల్ : ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పోతనపూడి, వీరవల్లి అగ్రహారం, గ్రామాలు సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. రబీ పంటలకు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం జరిగినప్పుడు తగిన పరిహారం అందుతుందన్నారు. ఎకరాకు రూ.300 చొప్పున ఈ నెల 15వ తేదీలోగా, రబీ వరి పంటకు ఎకరాకు రూ.630 చొప్పున ఈ నెల 31వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుకొండ భవానీ, యలగాడ కామలక్ష్మి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది టి.గౌరునాయుడు, మేఘమాల, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

మాకవరపాలెం : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ సూచించారు. వార్షిక తనిఖీల్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఏడాది పాటు నమోదైన వివిధ కేసుల రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పంథాలను అవలంబిస్తున్నారన్నారు. కొత్త వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదన్నారు. కొత్త వ్యక్తులు, వచ్చే ఫోన్ కాల్స్‌పై సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లేకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయొచ్చన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘాను విస్తృతం చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ మోహన్

బ్యూటీ థెరపీలో శిక్షణ

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణ పొందడానికి ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ ఎస్పిఓసి వెన్నెల అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి రెండు నెలలు ఉచిత శిక్షణతో పాటు, శిక్షణ అనంతరం ధ్రువ పత్రాలతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు 9494791935 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నిరుపేద కుటుంబానికి విశ్రాంత ఎంఈవో వితరణ

నాతవరం : భర్తను కోల్పోయి బతుకు భారంగా మారిన నిరుపేద కుటుంబానికి విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. పి.కె.గూడెం గ్రామానికి చెందిన వంగలపూడి గణేష్ కుమారి భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో గణేష్‌కుమారి తన కుమారుడితో బతుకు భారంగా మారి ఇబ్బందులు పడుతుంది. కూలి పని చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో టైలరింగ్ నేర్చుకుని కుట్టుమిషన్‌పై గోనె సంచులు కుట్టుకుని అరకొర ఆదాయంతో జీవనం సాగిస్తుంది. ఈ విషయం గ్రామపెద్దల ద్వారా తెలుసుకుని స్పందించిన విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ బుధవారం గ్రామంలో గణేష్‌కుమారికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గోనె సంచులు కుట్టుకునేందుకు కావలసిన ముడి సరుకులు కొనుగోలుకు ఈ సాయం అందించినట్టు తెలిపారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న విశ్రాంత ఎంఈవో అమృత్‌కుమార్

8 మంది విద్యార్థులకు సంతూర్ స్కాలర్‌షిప్

మాడుగుల : స్థానిక డిగ్రీ కళాశాలలో చదువుతున్న 8 మంది డిగ్రీ విద్యార్థినులు ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ సంతూర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.24 వేలు చొప్పున డిగ్రీ పూర్తయ్యే వరకు అందిస్తారు. సంస్థ వారు పెట్టిన పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన నిరుపేద మహిళా విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి ఈ సంస్థ తోడ్పాటు నిస్తుందని, కళాశాల ప్రిన్సిపాల్ సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన సీహెచ్. అనూషకుమారి, జె.మాధురి, జి.చిన్నారి, వై.ధనలక్ష్మి, జి.షాలిని, జి.గౌతమి, ఎస్.కుసుమ, జి.నాగమణిలను ప్రిన్సిపాల్ శాస్త్రి, ఇతర ఉపన్యాసకులు బుధవారం అభినందించారు.



మాడుగుల డిగ్రీ కళాశాలలో సంతూర్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులతో ఉపన్యాసకులు

టీకాలపై నిర్లక్ష్యం వద్దు

గొలుగొండ : వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలకు టీకాలు వేసే సమయంలో నిర్లక్ష్యం చేయరాదని గొలుగొండ పీహెచ్‌సీ కమ్యూనిటీ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన జోగుంపేట గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గర్భిణులకు, బాలింతలకు టీకాలు సకాలంలో వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

కె.కోటపాడు : 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను తల్లిదండ్రులు వేయించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. పీహెచ్‌సీలో బుధవారం వైద్య సిబ్బంది వ్యాదినిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 మంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు, 9 మంది గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. పీహెచ్ఎన్ కనకవేణి, ఏఎన్ఎం సన్యాసమ్మ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీహెచ్‌వో ప్రసాద్



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయిని



నాగజ్యోతి

రోలుగుంట : అనకాపల్లి జిల్లా మున్సిపల్ హైస్కూల్లో ఏడు రోజుల పాటు నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ కోర్సులో రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పీఈటీ ఎస్.గోవింద, ఆంగ్ల ఉపాధ్యాయుని నాగజ్యోతి శిక్షణ పొందారు. డీఈవో శ్రీ అప్పారావు నాయుడు చేతుల మీదుగా శిక్షణ పొందిన ధ్రువపత్రం పొందారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, క్రమశిక్షణకు ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగజ్యోతి అన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ శిక్షణ ఇచ్చి వారిని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతానన్నారు. తాను గైడ్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

వరి కోతలకు దూరంగా రైతులు

బుచ్చెయ్యపేట : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు తగ్గుముఖం పెట్టినా ఆకాశంలో కారు మబ్బులు ఇంకా వీడలేదు. దీంతో రైతులు వరికోతలకు సాహసించడం లేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు కోసిన వరి పనలు తడిచిపోగా పలువురి రైతులు వరి పొలాలు కోయకుండానే నేల వాలిపోయాయి. దీంతో వరి కంకులు నేలపై పడి ధాన్యం మొలకెత్తి నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. దీంతో కోతకొచ్చిన వరి పంటను ఆఖరి సమయంలో కోసి కుప్పలు పెట్టేందుకు రైతులు ఆరాటపడుతున్నారు. తడిచిన వరి పనలపై ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు నీళ్ల స్ప్రేయింగ్ చేయాలని పొలం గట్లుపై తడిచిన వరి పనలు వేసి ఆరబెట్టి తడి తగ్గిన తరవాత కుప్పలు పెట్టుకోవాలని వ్యవసాయాధికారి భాస్కరరావు సూచించారు.

చీడికాడ : మరో తుపాను రానుందన్న హెచ్చరికల నేపథ్యంలో పండిన వరి పైరును కోసేందుకు రైతులు ఆందోళనలో పడ్డారు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలతో రైతులు పంట తడిచి ఇబ్బందులు పడగా కొందరు రైతులు కోతలను వాయిదా వేసుకున్నారు. అయితే పంట పండి వరి ఎన్నులు నేలచూపులు చూస్తున్నాయి. మరో పక్క రెల్లరాల్చు పురుగుతో వరి వెన్నులు నేలపాలౌతున్నాయి.

వ్యర్థాలతో పట్టుబడిన వాహనాన్ని వదిలేశారేం?

దేవరాపల్లి : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు నిషేధిత చికెన్ వ్యర్థాలు, నిల్వ ఆహారం తరలిస్తూ పట్టుబడిన వాహనంపై కేసు నమోదు చేయకుండా విడిచి పెట్టడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మండిపడ్డారు. మత్స్యశాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమక్షంలో మంగళవారం తారువలో పట్టుకున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌ను తీసుకువచ్చారని, అయితే నామమాత్రంగా రూ. 5వేలు జరిమానా విధించి విడిచిపెట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.